అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్ హిమాన్షు శుక్లా

విశాలాంధ్ర - అమలాపురం : తుపాను హెచ్చరికల దృష్ట్యా ఈ నెల 28వ తేదీ వరకు గోదావరి తీర ప్రాంతం సముద్ర తీర ప్రాంతం వెంబడి ఉన్న కోనసీమ జిల్లావాసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరుములు మెరుపులతో కూడిన పిడుగులు పడే అవకాశం ఉందని సూచించారు. బలమైన గాలులు వీచే అవకాశం కూడా ఉందని తీర ప్రాంతంలో మత్స్యకారులు ఈ ఐదు రోజులు పాటు సముద్రంలోనికి చేపల వేటకు వెళ్లరాదని సూచించారు. బంగాళా ఖాతంలో సముద్ర పరిస్థితి అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉందన్నారు. విపత్తుల నిర్వహణ సంస్థ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. లైన్ డిపార్ట్మెంట్లు స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ప్రకారం సహాయక చర్యలకు సంసిద్ధులు కావాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు వర్షాల పరిస్థితిని తుపాన్ల స్థితిగతులను నిశితంగా పర్యవేక్షిస్తూ హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు.

వరద ప్రభావిత ప్రాంతాలలో ఎస్పీ శ్రీధర్ పర్యటన

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరం మండలంలోని గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలైన జి పెదపూడి లంక, బూరుగులంక, అరిగేలవారి పేట, ఊడిముడి లంక గ్రామాలను జిల్లా ఎస్పీ శ్రీధర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయాగ్రామాల వద్ద గోదావరి వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. లంక గ్రామాలకు పడవలపై వెళ్లేవారు పరిమిత సంఖ్యలో వెళ్లాలని సూచించారు. స్థానిక సచివాలయ సిబ్బంది పోలీసులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు.

ప్రమాదకరంగా ఎర్రవంతెన

విశాలాంధ్ర -పెరవలి : పెరవలి మండలంలో గల ఖండవల్లి గ్రామ పరిధిలో ఉన్న లంకమాలపల్లి సమీపంలో ఉన్న ఎర్రవంతెన ప్రమాదకరంగా మారింది. గోదావరి ఏటిగట్టుకు గ్రామానికి మధ్య రాకపోకలు జరిపేందుకు ఈ వంతెన ఉపయోగపడుతుంది. లంక భూములలో పండించే పంటలను పశువులకు కావలసిన గడ్డిని వాహనాలపై ఈవంతెనపైనుండే తరలిస్తుంటారు. ఎన్నో దశాబ్దాల కాలంగా ఈవంతెన ఏర్పడి ఉంది. ప్రస్తుతం దీనికి ఇరువైపులా రైలింగ్ విరిగిపోవడం వలన అటువైపు ప్రయాణించాలంటే భయపడాల్సిన పరిస్థితి ఎదురైందని స్థానికులు వాపోతున్నారు. ఈవంతెనపైనుండి ప్రయాణిస్తే ఏసమయంలో ఏప్రమాదం జరుగుతుందో అని స్థానికులు అంటున్నారు.గతంలో అనేక మార్లు ప్రమాదాలు జరిగిన సందర్భాలు లేకపోలేదు.ఇప్పటికైనా అధికారులు, పాలకులు గ్రహించి ఈవంతెనపై రైలింగ్ ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటర్ లిస్ట్ రీ సర్వే సమర్ధవంతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : డివిజన్లో జరుగుతున్న ఓటరు లిస్టు రీ సర్వేను సమర్ధవంతంగా నిర్వహించాలని పెద్దాపురం ఆర్డీఓ జేవీఎస్ రామారావు ఆదేశించారు. ఓటర్ రీ సర్వే కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వడ్లమూరులో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జేవీఎస్ రామారావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలపై ప్రజలు మరింత పూర్తి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఓటరు జాబితాలపై అపోహలు ప్రజల్లో తొలగిపోవాలంటే వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న రీసర్వే విధానాన్ని క్షుణ్ణంగా పరిశీటించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కళ, వైఎస్సార్ సీపీ నాయకలు కంటే వీర్రాఘవరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కిర్లంపూడి : ప్రజా సమస్యలు పరిష్కరించి, ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అందివ్వడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మంగళవారం కిర్లంపూడి మండలం వీరవరం గ్రామంలో ఎంపిపి తోట రవి, తోట గాంధీ, సర్పంచ్ అంబటి బొజ్జమ్మ, ఎఎంసి చైర్మన్ తోట విష్ణు తదితరుల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటి బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు మాట్లాడుతూ గ్రామ ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మంజూరైన వివిధ రకాల సర్టిఫికేట్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీరవరం ఎంపిటిసి తోట వేణు కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబి, అల్లు విజయకుమార్, కిర్లంపూడి తహసిల్దార్ కెవి మాధవరావు, ఎంపీడీవో బడే రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల కోసం సర్వే

విశాలాంధ్ర - రాజోలు : మండలంలో బడి బయటి పిల్లల కొరకు జులై 17వ తేదీ నుండి ఆగస్టు 7వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం ఇచ్చిన సర్వేను సిఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎవ్వరూ కూడా బడి బయటి పిల్లలుగా ఉండకూడదని ఇచ్చిన షెడ్యూల్ లోపు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని సూచించారు. మండలంలో జరుగుతున్న టీచర్ కాంప్లెక్స్ ట్రైనింగ్ తరగతులను కూడా పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎస్ మనోహరం, సిఆర్ఎంటిలు పాల్గొనడం జరిగింది.

ఓటరు జాబితా పరిశీలన తప్పనిసరి

విశాలాంధ్ర - శంఖవరం : ఓటర్ల జాబితా పరిశీలన తప్పనిసరిగా నిర్వ హించాలని శంఖవరం తహసీల్దార్ కే సుబ్రహ్మణ్యం తెలిపారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా జాబితా సిద్ధం చేయాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సూపర్వైజర్లతో జరిగిన సమావేశంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. బిఎల్వోలు సర్వేను పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఇంటింటికి తిరుగుతూ ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్తగా అర్హులైన వారి పేర్లను నమోదు చేయాలని, ఇంట్లో ఎంత మంది ఉన్నారు. వలస వెళ్లిన వారు ఎంత మంది అనే వివరాలతో పాటు కొత్త ఓటరుగా నమోదయ్యేవారు ఎవరైన ఉన్నారనే విషయాలను పకడ్బందీగా నమోదు చేయాలని తెలిపారు. దీంతో పాటు ఇంటి వద్ద ఓటరు ఉన్నా లేకపోయినా బీఎల్ఓ అక్కడ ఫొటో దిగి గరుడ యాప్లో ప్రతిరోజు నమోదు చేయాలని అన్నారు. ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే ఆ వ్యక్తి ప్రతిపాదనకు అవసరమైన చోట ఓటు హక్కు ఉంచి అవసరం లేని చోట తొలగిస్తున్నారని తెలిపారు. ఎన్నికల విధుల్లో వాలంటీర్లను వినియోగించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, డిటి శ్రీనివాస్, ఆర్ఐ రేవతి, ఏఎస్ఓ పిఎం బి. ప్రసాద్, రీ సర్వే డిటి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి

విశాలాంధ్ర-రాజమండ్రి : మణిపూర్ సీఎం రాజీనామా చేయాలని, బీజేపీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని, మణిపూర్ అత్యాచారం, హింస ఘటనను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక శ్యామల సెంటర్ వద్ద పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేసారు.దేశంలో ఆడ బిడ్డలకు రక్షణ కల్పించాలని, బీజేపీ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని, హిందూ మతోన్మాదం నశించాలని నినాదాలు చేశారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ మణిపూర్లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయని అన్నారు. దీన్ని వెంటనే ఆపి అక్కడ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కుకీ తెగకు చెందిన ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక లైంగిక దాడి, హత్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నదని పేర్కొన్నారు. దీన్ని ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. మణిపూర్ జనాభాలో 54 శాతానికి పైగా ఉన్న మైతి తెగలు కుకీ ,నాగ గిరిజన తెగల మధ్య బిజెపి తన రాజకీయ లబ్ధి కోసం చిచ్చు పెడుతున్నదని విమర్శించారు. ఈ హింసాత్మక ఘటనలకు కేంద్ర ప్రభుత్వం మణిపూర్ రాష్ట్ర బిజెపి ప్రభుత్వాలు బాధ్యత వహించి రాజీనామా చేయాలని, దోషులను వెంటనే శిక్షించాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి. కొండలరావు, సహాయ కార్యదర్శి సప్పా రమణ, జట్ల సంఘం సభ్యులు పి.దేముడు, వెంకటరావు, కె. అప్పల నాయుడు, నల్ల రామారావు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కొండలరావు , నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

-జాయింట్ కలెక్టర్ ఇలక్కియ

విశాలాంధ్ర- కాకినాడ : భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)-2024 కార్యకలాపాల్లో భాగంగా బీఎల్వోలతో ఈ నెల 21వ తేదీన ప్రారంభమైన ఇంటింటి సర్వే జిల్లాలో విజయవంతంగా సాగుతోందని.. ఈ నేపథ్యంలో ప్రతి వారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నియోజకవర్గం, జిల్లాస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కోర్టుహాల్లో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ.. డీఆర్వో కె.శ్రీధర్రెడ్డితో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో వాలంటీర్లు పాల్గొనకుండా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని.. నిబంధనలు ఉల్లంఘించే బీఎల్వోలపై చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. 2024, జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదుకు అర్హులని వివరించారు. ఫారం 6, ఫారం 7, ఫారం 8లు బీఎల్వోలు, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్ (బీఎల్ఏ)ల నియామకాన్ని పూర్తిచేయాలని కోరారు. ఇంటింటి సర్వేకు సంబంధించిన వివరాలను ప్రతి వారం జరిగే సమావేశాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించడం జరుగుతుందని.. ఏవైనా సందేహాలున్నా నివృత్తి చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఇలక్కియ తెలిపారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథంతో పాటు ఆర్.వెంకటేశ్వర రావు (వైఎస్ఆర్ కాంగ్రెస్), జి.సాయిబాబు (తెలుగుదేశం), కె.పోతురాజు (కాంగ్రెస్), ఎస్.అప్పారావు (బీఎస్పీ), ఎం.రాజశేఖర్ (సీపీఎం), ఎన్.శివ(ఆమ్ ఆద్మీ పార్టీ) తదితరులు హాజరయ్యారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

విశాలాంధ్ర - పి గన్నవరం : తుపాన్లు, భారీ వర్షాల వల్ల ముంపు బారిన పడే అవకాశమున్న ప్రాంతాలలో 400 కుటుంబాలకు కేంద్ర బిందువుగా ఒక కుకింగ్ సెంటర్ ఏర్పాటు చేసి ముంపు బాధితులకు ఆహారం, అల్పాహారం చిన్నారులకు పాలు, సురక్షిత తాగునీరు సరఫరాపై డివిజన్ మండల స్థాయి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక మండల పరిధిలోని మానేపల్లి శివాయిలంక, పి గన్నవరం గ్రామాలలో పర్యటించి ముంపు ప్రభావిత ప్రాంతాలలో డివిజన్ మండల స్థాయి అధికారులతో కలిసి పర్యటించి వరద పరిస్థితిని ద్విచక్ర వాహనం పై పయనించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు అన్నింటిని వరదల సమయంలో కాకుండా ముందుగానే సేకరించు కోవాలని సూచించారు.ముంపు పొంచి ఉన్న గ్రామాలలో వరద పరిస్థితులపై సమీక్షించి ఆయా ప్రాంతాలలో ముందుస్తు హెచ్చరి కలు జారీచేస్తూ ముంపు బాధి తులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు భోజన ఏర్పాట్లకు సంసిద్ధంగా ఉండాలన్నారు. సహాయ పునావాస కార్యక్రమాలకు సన్నద్ధం కావాలన్నారు. పునరావాస కేంద్రాలలో కనీస వసతులు ముందుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.ముక్కంటి తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - ముమ్మిడివరం : భారీ వర్షాలు, వాయుగుండం కారణంగా మున్సిపల్ సిబ్బందితో ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, కమిషనర్ జి. లోవరాజు అధ్యక్షతన అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ భారీ వర్షాల వలన ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వేడినీటిని తాగాలని, పాడుబడ్డ ఇళ్లలో ఉండకూడదని, ఎలక్ట్రికల్స్ స్తంభాలు ముట్టుకోకూడదని సురక్షిత ప్రాంతాలకువెళ్లాలని ఎప్పటికప్పుడు డ్రైనేజీలు క్లీనింగ్ వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మరో రెండు రోజులుపాటు భారీ వర్షాలు ఉండడంవల్ల త్రాగునీరు పారిశుద్ధ్యం, వీధిదీపాలు, సమస్యలు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ సిబ్బందికి తెలియజేశారు.

మంచినీటి చెరువులో చేపల వేట నిలపాలి

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మున్సిపాలిటీ ప్రజలకు రక్షిత మంచినీటిని అందించే చెరువులో చేపల వేటను ఆపాలని కోరుతూ 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు మున్సిపల్ కమిషనర్ జే రామారావుకు వినతిపత్రం అందజేశారు. బుధవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ను కలిసి మాట్లాడుతూ మంచినీటి చెరువులో చేపలు వేటకు ఒక వారం పది రోజులు తప్ప నెలలు తరబడి అనుమతి నివ్వడం వలన రాత్రి, పగలు యథేచ్ఛగా చేపల వేట కొనసాగిస్తున్నారన్నారు. అసలే వర్షాకాలం ప్రారంభమై జలాలు కలుషితమవుతుండడంతో చేపలు వేట వలన చెరువులో ఉన్న జలాలు మరింత కలుషితమై ప్రజలు డయేరియా, పచ్చకామెర్లు వంటి బలహీనతలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టించి తక్షణమే చేపల వేట నిలిపివేయాలని ఆయన కమిషనర్ను కోరారు. చేపల వేట విషయానికి సంబంధించి కౌన్సిలర్లు పై ఆరోపణల్లో వాస్తవం లేద న్నారు. కేవలం సొసైటీ వారు మున్సిపాలిటీకి చలానా రూపంలో ఆ సొమ్మును చెల్లించారని దానికి కౌన్సిల్కి ఎలాంటి సంబంధం లేదని హరిబాబు స్పష్టం చేశారు. కమిషనర్ రామారావు మాట్లాడుతూ ప్రజారోగ్యం దృష్ట్యా తక్షణమే చేపల వేట నిలిపివేతకు ఆదేశించనున్నట్టు చెప్పారు.

పాస్పోర్టు పడిపోయినది

నేదునూరు పెదపాలెం గ్రామ నివాసి అయిన **కొట్నాల భాను భర్త వెంకటేశ్వరరావు** అను నేను నా పాస్పోర్టు నెం :**S1604722** ను జిరాక్స్ తీసుకొనుటకు ఇంటి దగ్గర నుండి నేదునూరు సెంటర్కు వెళ్ళినపుడు మార్గమధ్యలో జారిపడిపోయినది. దొరికిన వారు తెలియజేయగలరు.

కొట్నాల భాను భర్త వెంకటేశ్వరరావు
నేదునూరు పెదపాలెం
సెల్ : 8367370519

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్కు బదిలీపై వచ్చిన ఎస్సై బివై కిరణ్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆత్రేయపురం మండల పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా చర్యలు చేపడతామని అన్నారు. యువతను మత్తుకు బానిస చేస్తున్న పాన్,గుట్కా, తంబాకు, వంటి మత్తు పదార్థాలను విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవు అన్నారు. గ్రామంలో నివసించే ప్రజలకు దొంగలు, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా సచివాలయ మహిళా పోలీసుల ద్వారా వారికి అవగాహన కల్పించడం, పార్సిల్ పేరుతో ఓటీపీ ద్వారా బ్యాంకులో ఉన్న సొమ్ము స్వాహా చేస్తున్న వారి నుండి ప్రజలను రక్షించే దిశగా చర్యలు చేపడతామన్నారు. ప్రతి గ్రామంలో ఆలయాల వద్ద ఏర్పాటుచేసిన సిసి కెమెరాలు పని చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి వంటి మత్తు పదార్థాలును విక్రయించిన, సేవించిన వారిపై కఠిన శిక్షలు తప్పవని అన్నారు.

కనిపించే దైవాలు వైద్యులు

విశాలాంధ్ర - రావులపాలెం : కోవిడ్-19 లాంటి విపత్కర పరిస్థితులలో ప్రాణాలకు తెగించి డాక్టర్లు అందించిన సేవలు ఎనలేనివని, కనిపించే దైవాలు డాక్టర్లు అని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెం విజయవేదికలో ఐఎంఎఫ్ రావులపాలెం ప్రెసిడెంట్ డాక్టర్ శేషుబాబు, సెక్రటరీ డాక్టర్ రమేష్ రెడ్డి, డాక్టర్ గంగిరెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిర్ల జగ్గిరెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిర్ల చేతుల మీదుగా సీనియర్ డాక్టర్లు మాజీ శాసనసభ్యులు డాక్టర్ ఐఎస్ రాజు, డాక్టర్ పడాల వెంకటరెడ్డి, డాక్టర్ మెంటే ఉదయభాస్కరరావు, డాక్టర్ చిన్నంరాజును చిర్ల సన్మానించారు. అనంతరం చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ సమా జంలో కుల, మతాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు మొక్కే దేవుళ్ళు డాక్టర్లు అని, డాక్టర్లను కూడా కొంతమంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని అలాంటి వారి నుండి డాక్టర్లకు రక్షణ కల్పించడం మా బాధ్యత అన్నారు.

గాదరాడలో జనసేన ర్యాలీ

విశాలాంధ్ర - రాజానగరం : రాజానగరం నియోజకవర్గంలో జనసేన జెండా ఎగరేయడమే తమ ధ్యేయమని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి బత్తుల బలరామకృష్ణ అన్నారు.పార్టీ పగ్గాలు అందుకున్న తర్వాత బత్తుల బలరామ కృష్ణ ఆధ్వర్యంలో తొలిసారిగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.నియోజకవర్గంలోని గాదరాడ గ్రామం నుండి కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. దీంతో బలరామకృష్ణ దంతులిద్దరికీ శుభాకాంక్షలు తెలిపి,ర్యాలీ లో పాల్గొనేం దుకు జన సైనికులు భారీగా చేరుకోవడంతో గాదరాడ గ్రామం జనసంద్రంగా మారింది.తొలుత ర్యాలీ లో పాలున్న బత్తుల కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గలోని మూడు మండలాల జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

డ్రాప్ అవుట్లకు జేవీకే కిట్లు అందజేత

విశాలాంధ్ర - కరప : బడి మానివేసిన పిల్లలను బడిలో చేర్పించడంలో భాగంగా బుధవారం డ్రాప్ అవుట్ల క్యాంపెయినింగ్లో భాగంగా కరప జడ్పీ హైస్కూల్లో చదువుతూ మధ్యలో బడి మానివేసిన విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించినట్టు కరప ఎంఈఓ 2 పి.సత్యనారాయణ తెలిపారు. కాకర సత్యనారాయణ పుట్టే సతీష్, పొన్నాడ నాగచైతన్య అను ముగ్గురు విద్యార్థులకు గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి కుమార్ చేతుల మీదుగా జెవికె కిట్లు అందించి బడిలో చేర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మల్లేపల్లి ఉపాధి హామీ మస్తర్లలో గందరగోళం

-తప్పులను ఒప్పుకున్న మేట్లు

-ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామన్న ఏపీవో

విశాలాంధ్ర - గండేపల్లి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తవ్వే కొద్ది అవినీతి బట్టబయలు అవుతుంది అనేందుకు నిదర్శనం గండేపల్లి మండలం మల్లేపల్లి పాతూరు. గ్రామానికి చెందిన నడిశెట్టి రాంబాబు స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేసి తమ ప్రాంతంలో నలుగురు మేట్లు ఆధ్వర్యంలో ఉపాధి అవినీతి జరిగిందని విచారణ జరపాలంటూ ఫిర్యాదు చేశాడు. దీంతో బుధవారం మల్లేపల్లి పాతూరు శివాలయంలో ఏపీవో గంగాభవాని ఈసీ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్లు ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. నలుగురు మేట్లు పరిధిలోని జాబ్ కార్డులు, స్థానికంగా ఉంటున్నారా, లేదా, ఎన్ని మస్తర్లు పడ్డాయి. అనే వాటిపై విచారణ నిర్వహించారు. దీనిపై మేట్లు కొందరు స్థానికంగా ఉండటం లేదని, ఒకరి జాబు కార్డు పై మరొకరు పనిలోనికి వస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ఏపీవో మాట్లాడుతూ నలుగురు మేట్లు వద్ద ఉపాధి కూలీల వద్ద లిఖితపూర్వకంగా స్టేట్మెంట్లు తీసుకోవడం జరిగిందని వీటిని ఉన్నతాధికారుల వద్ద ఉంచి వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

హుకుంపేట జెడ్పీ హైస్కూల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : హుకుంపేట జెడ్పీ హైస్కూల్ ను కలెక్టర్ మాధవీలత బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యను నిర్లక్ష్యం చేయరాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిజిటిలైజేషన్ విధానంలో అత్యున్నత విద్యా విధానాన్ని అమలు చేస్తుందని, ప్రైవేటు విద్యా సంస్థలలోసైతం ఆచరణకు సాధ్యం కాని విధంగా బోధిస్తున్నారని మాధవీలత తెలియచేశారు. బుధవారం బడి బయట ఉన్న ఐదు గురు పిల్లలను బడిలో చేర్చామన్నారు. తల్లి తండ్రులు పిల్లల చదువుల విషయంలో తగినజాగ్రత్తలు తీసుకుని తప్పకుండా స్కూల్ కి పంపాలని కోరారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డిఈఓ ఎస్. అబ్రహం, ఎంఈఓ చందూ కుమార్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

28 న ఉద్యోగుల ఫిర్యాదుల దినోత్సవం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ :జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల మూడో శుక్రవారం ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత తెలియ చేశారు. జూలై నెలకు సంబంధించి ఈనెల 28 శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగులు వారికి చెందిన అర్జీలను స్వీకరించేందుకు కలెక్టరేట్ లోని స్పందన హాలులో సాయంత్రం 4 గంటల నుంచి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఉద్యోగులు వారికి చెందిన వ్యక్తిగత, తదితర అర్జీలను వ్రాత పూర్వకంగా అందచేయాలని కలెక్టర్ సూచించారు. ఆగస్ట్ మాసం నుంచి ప్రతి నెల మూడో శుక్రవారం ఉద్యోగస్తుల నుంచి విజ్ఞాపనలు స్వీకరిస్తారని ఆమె తెలిపారు.

వర్జీనియా పొగాకు రైతులకు సహకారం అందించండి

విశాలాంధ్ర - గోపాలపురం : వచ్చే ఏడాది వర్జీనియ పొగాకు సాగు చేసే రైతాంగానికి పంటల రుణానికి సహకారం అందించాలని టొబాకో బోర్డు రీజనల్ మేనేజర్ కోరారు. బుధవారం గోపాలపురం టొబాకో బోర్డు వేలంకేంద్రం పరిధిలోని క్రాఫ్ట్ కమిటీ ఆధ్వర్యంలో ఏలూరులోని యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మూర్తి తో సమావేశమయ్యారు. టొబాకో బోర్డు రీజినల్ మేనేజర్ ఎం. ఆదిశేషయ్య మాట్లాడుతూ 2023- 24 సంవత్సరానికి వర్జీనియా పొగాకు సాగు చేసే రైతులకు ఎరువులు సమకూర్చుకునేందుకు రూ. సుమారు 50 కోట్లు అవసరం ఉందని, ఈ ఏడాది యూనియన్ బ్యాంకు ద్వారా రైతాంగానికి సమకూర్చనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు టొబాకో బోర్డు ఎక్స్టెన్షన్ మేనేజర్ దామోదర్, నోడల్ ఆఫీసర్ ప్రశాంత్ , గోపాలపురం, కొయ్యలగూడెం ఫ్లోర్ ప్రెసిడెంట్లు పిన్నమనేని మధు మోహన్, కాకర్ల వివేకానంద, క్రాఫ్ కమిటీ చైర్మన్ పరిమి జగదీష్, వైస్ ప్రెసిడెంట్ శేషు బాబు పాల్గొన్నారు.

కొండ గోదావరి ముంపులో పంట పొలాలు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో రాపాక, నల్గొండ, రఘుదేవపురం, కూనవరం మొదలగు గ్రామ పంచాయతీ పరిధిలో పంట పొలాలు వరద నీటితో మునిగిపోయాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బురద కాలువ చుట్టూ ఉన్న వరి పొలాలు కొండ గోదావరి వరద నీటితో మునిగాయి. ప్రతీ సంవత్సరం రెండు,మూడు నెలల పాటు రైతుల పంటలు వరద పాలు అవుతున్నాయి. ఈ సమస్య పై మండల రైతులు అనేక సార్లు అధికారుల, నాయకుల దృష్టికి తీసుకొని వెళ్ళి పరిష్కారం చూపాలని కోరారు. కొన్ని రోజుల క్రితం మీర్తిపాడు వంతెన వద్దకు అధికారులు ఈ సమస్య పై జిల్లా కలెక్టర్ కు మండల రైతులు పెట్టుకొన్న అర్జీ పై తనిఖీ చేసి రైతుల వద్ద నుండి సూచనలు సలహోలు తీసుకొని వెళ్ళారు. రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే జగనన్న సురక్ష

విశాలాంధ్ర - గోపాలపురం :సాంకేతిక సమస్యల కారణంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్న సురక్ష ఎంతగానో దోహద పడుతుందని స్థానిక శాసనసభ్యులు తలారి వెంకటరావు తెలిపారు. బుధవారం మండలంలోని వాదాల కుంట గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ జొన్నకూటి మణెమ్మ అధ్యక్షతన సురక్ష కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని 11 రకాలైన సేవలు భాగంగా అపరిష్కృతంగా ఉన్న ప్రతి సమస్య అక్కడికక్కడే పరిష్కారానికి ముఖ్యమంత్రి చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు.గ్రామంలో 1763 టోకెన్లకు గాను 17 60 లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో భాగంగా గ్రామానికి మరొక రూ, 30 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ కాకులపాటి లలిత,నియోజకవర్గ మహిళా కన్వీనర్ ఎండపల్లి కవిత, వైసీపీ నాయకులు జొన్నకూటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ వల్లభనేని సత్యనారాయణ, గద్దె ఈశ్వరుడు, పోతిరెడ్డి నాగరాజు,ఎండపల్లి శేఖర్ బాబు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

15 ఏళ్ల తర్వాత అదుపులోకి నిందితుడు

విశాలాంధ్ర - చాగల్లు : భార్యను హింసిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు చాగల్లు కు చెందిన వి. సురేష్ పై 2005లో కేసు నమోదు చేశారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్ పై రాజమహేంద్రవరం కారాగారానికి పంపించారు. ఆపై తిరిగి వచ్చిన అతను కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఎట్టకేలకు చాగల్లు పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని నిడదవోలు న్యాయస్థానంలో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు చాగల్లు ఎస్సై సిహెచ్.వి. రమేష్ మంగళవారం రాత్రి విలేకరులకు వివరించారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

విశాలాంధ్ర-దేవరపల్లి: మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పేర్కొన్నారు. దేవరపల్లి మండలం త్యాజంపూడిలో జగనన్న సురక్షా కార్యక్రమంలో సర్పంచ్ కుసులూరి స్వరూప రాణి సతీష్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందని అన్నారు. దేవరపల్లి మండలంలో 21 సచివాలయాలలో జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయన్నారు ఈ సందర్భంగా వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుసులూరి స్వరూప రాణి, ఉప సర్పంచ్ కుసులూరి వెంకట సతీష్, ఏఎంసి చైర్మన్ జి. జనార్ధన రావు, దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు, తహసీల్దార్ రామకృష్ణ. వాలంటీర్లు అధికారులు పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జంగారెడ్డిగూడెం మండలంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పట్టెన్న పాలెంలోని జల్లేరు వాగు, శ్రీనివాసపురం తోటపల్లి గ్రామాల మధ్యలో ఉన్న రేల వాగు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. జంగారెడ్డిగూడెం డిఎస్పీ ధనుంజయుడు మండలంలోని వాగుల వద్దకు వెళ్లి పరిశీలించారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున దాటే ప్రయత్నాలు చేయరాదని ప్రజలకు సూచనలు చేశారు. వాగుల వద్ద పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం నుంచి గంట గంటకు వరద ఇన్‌ఫ్లో పెరుగుతూ వస్తుంది. గంటకు 4వేల602 క్యూసెక్కుల వరద నీరు జలాశయంలో వచ్చి చేరుతుందని ఇరిగేషన్ ఏఈ భాస్కరరావు తెలిపారు. జలాశయం నీటిమట్టం 82.50 మీటర్లు కాగా ప్రస్తుతం 79.60 మీటర్లకు చేరుకుందని ఏఈ తెలిపారు.

పథకాలు అందాలంటే మళ్లీ జగనే రావాలి

విశాలాంధ్ర -జీలుగుమిల్లి :ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని మళ్లీ ఈ పథకాలు రావాలంటే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఆదరించాలని ఎంపీపీ కోర్స పోసమ్మ, జెడ్పీటీసీ మల్లం వసంత రావు అన్నారు. బుధవారం జీలుగుమిల్లి జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కొంతమందికే పథకాలు అందాయని, ఈ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ పంచాయతీలో జగన్ ప్రభుత్వంలో 13 కోట్ల 50 లక్షల రూపాయలు పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. ప్రజల ఇంటికే సంక్షేమ పథకాలు సచివాలయ సిబ్బంది ద్వారా అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరి జగదాంబ, ఉపసర్పంచ్ బొంతు రవితేజ, సొసైటీ అధ్యక్షులు బోధ శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు బి. ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో రహదారి గోతులు

- వాహనచోదకుల ఇబ్బందులు

విశాలాంధ్ర - భీమడోలు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఏలూరు జిల్లాలోని భీమడోలు మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం ధాటికి భీమడోలు, గుండుగొలను, పూళ్ళ మేజర్ గ్రామాలలో పాటు మండలం లోని చాలా చోట్ల భారీగా వర్షం కురిసింది.. గడచిన పదిరోజులుగా స్వల్ప విరామాలతో వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. భీమడోలు రైల్వేగేటు నుండి సంతమార్కెట్ మీదుగా భీమడోలు జంక్షన్ వరకు, రాజులవీధి మీదుగా జంక్షన్ వరకు పలు చోట్ల రహదారులపై ఏర్పడ్డ గోతులలో వర్షపు నీరు చేరి వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు.

మణిపూర్ మారణహోమానికి మోదీ సమాధానం చెప్పాలి

విశాలాంధ్ర -భీమవరం: మణిపూర్ లో జరుగుతున్న మారణ హోమానికి ప్రధాని మోడీ సమాధానం చెప్పాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక కృష్ణమూర్తి, భీమవరం డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనలను నిరసిస్తూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కార్యకర్తలు భీమవరం అంబేద్కర్ సెంటర్లో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లంక కృష్ణమూర్తి మాట్లాడుతూ మణిపూర్ లో జాతుల వివక్షత సరి చేయటంలో కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం, విఫలమయ్యాయని విమర్శించారు. మారణ హోమంలో సుమారు 250 మంది చనిపోవడం, వందలాది ఇళ్లను, క్రైస్తవ చర్చిలను, దేవాలయాలను కూల్చివేయడం జరిగిందని మణిపూర్ ప్రభుత్వం ఏమి పట్టించుకోవడం దారుణమన్నారు. మణిపూర్ ఘటనలు యావత్ భారతదేశానికి తల వంపులని మణిపూర్ లో శాంతి నెలకొనేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణం మణిపూర్ ముఖ్యమంత్రి, మణిపూర్ ఎంపీ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కనుమూరి వెంకటపతి రాజు, దుగ్గిరాల శ్రీనివాస్, మోకా పరమేశ్వర రావు, వాటాల రాంబాబు, తిరుమణి వనమ రాజు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సిబ్బంది నియామకానికి ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-ఏలూరు : ఏలూరు డివిజన్ పరిధిలోని ఏలూరు, పెదపాడు, భీమడోలు, కైకలూరు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ సిబ్బంది నియామకానికి ఏలూరు ఆర్డీఓ కె. పెంచల కిషోర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఏలూరు, పెదపాడు, భీమడోలు, కైకలూరు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీల్లో 10 మంది అంగన్వాడీ సహాయకురాలు, 24 మినీ అంగన్వాడీ కార్యకర్తల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 85 మంది అభ్యర్థినులు హాజరైనట్లు ఆర్డీఓ కె. పెంచల కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి కెఎల్ విఎల్ పద్మావతి, సిడిపిఓ ఎ. పద్మావతి. ఇంఛార్జి డిప్యూటీ డిఎంహెచ్ ఓ డా. లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న రహదారి

విశాలాంధ్ర-పాలకొల్లు: ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల దాటికి, పాలకొల్లు పట్టణంలో అనేక ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ప్రధానంగా పాలకొల్లు హౌసింగ్ బోర్డ్ కాలనీ నుండి పాలకొల్లు పోలీస్ స్టేషన్ మీదుగా వెళ్ళే రహదారి ఎక్కడికక్కడ గోతులు పడిపోవడంతో పూర్తి అధ్వానంగా తయారయింది. గోతుల్లో వర్షపు నీరు చేరుకుని నడిచేందుకు కూడా వీల్లేని పరిస్థితిని ఉంది. వెంటనే అధికారులు మేల్కొని రహదారిని పునరుద్ధరించాలని, సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్గిల్ విజయ్ దివాస్ వేడుకలు



విశాలాంధ్ర-పాలకొల్లు : పాలకొల్లు పట్టణ పరిధిలో ఉన్న జి.వి.ఎస్వి ఆర్.యం మున్సిపల్ ప్రాథమిక పాఠశా లలో ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్ అధ్యక్షతన కార్గిల్ విజయ్ దివాస్ వేడుకలు బుధవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి భవాని ప్రసాద్ మాట్లాడుతూ, 1999వ సంవత్సరంలో కాశ్మీర్ లోనీ సియాచిన్ ప్రాంతాన్ని ఆక్రమించడానికి పాకిస్తాన్ ప్రయత్నించిందనీ, ఆ ప్రయత్నాన్ని తిప్పి కొట్టి భారత్ తన భూభాగాన్ని సాధించుకుందనీ తెలిపారు. ఆపరేషన్ విజయ్ గా పిలవబడే ఆయుద్ధంలో మొత్తం 520 మంది భారతదేశ సైనికులు మరణించారన్నారు. 60 రోజులు పాటు ప్రపంచంలోనే ఎత్తైన ప్రదేశం లో జరిగిన ఈ యుద్ధం, జులై 26 న ముగిసిందన్నారు. అందుకే ఈ రోజున కార్గిల్ విజయ్ దివాస్ గా జరుపుకుంటారని విద్యార్థులకు వివరించారు. ప్రతి పౌరుడు జవానుల త్యాగాలను తలుచుకుని పులకించిపోతారన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బి త్రిమూర్తులు, శశికళ, కరణం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మణిపూర్ బాధితులకు సంఘీభావంగా శాంతి ర్యాలీ

విశాలాంధ్ర-ఆకివీడు : భరతమాత అని చెప్పే భారతదేశం లో మణిపూర్ రాష్ట్రంలో జరిగిన సంఘటన దుశ్చర్యాన్ని చిన్నమిల్లిపాడు గ్రామస్తులు ఖండించారు. బుధవారం ఆకివీడు మండలంలోని చిన్నమిల్లిపాడు సీబీసీఎంసీ చర్చిలో మణిపూర్ సంఘటనలో బాధించబడిన వారికోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి. గ్రామంలో శాంతియుతరాలి నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు అంబటి రమేష్, గుండుగోలు ధనరాజ్, ఏఐసిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మేడవంకల రవి మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఈ హింసకాండ కోసం స్పందించకపోవడం క్రైస్తవ సంఘాలను చిన్నచూపు చూసే విధంగా ఉందని. వెంటనే స్పందించి ఈ చర్యలకు తగిన పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమించి కేంద్ర ప్రభుత్వ అసమర్థతను ఎండగడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ పళ్లెం దేవదాస్, మద్దా పేత్రు, పీతల కాంతారావు, పండు, ప్రేమానంద్ గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

తమ్మిలేరుకు వరద ఉధృతి

విశాలాంధ్ర-చాట్రాయి: తెలంగాణ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల తమ్మిలేరుకు వరద ఉధృతి పెరుగుతోంది. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన బుధవారం మధ్యాహ్నం చాట్రాయి మండలం చిన్నంపేట గ్రామం వద్ద ఉన్న తమ్మిలేరు కాజ్వే వద్ద వరద ఉధృతి పెరగటం ప్రారంభమైంది. కాజ్వే వద్దకు మత్స్యకారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.తమ్మిలేరు రిజర్వాయరు నీటిమట్టం 340 అడుగులకు చేరుకున్నట్లు ఏఈ పరమానందం తెలిపారు.413 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 20 క్యూసెక్కుల నీరు తూముల ద్వారా బయ టికి వచ్చినట్లు తెలిపారు. మూడు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు నిండటం వలన పక్షంగా 25 వేల ఎకరాల పైగా భూములకు సాగు నీరు అందుతుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోలవరం పి ఎస్ సి ఎస్ చైర్పర్సన్ చెలికాని బాబ్జి మాట్లాడుతూ ప్రాజెక్టు నిండటం వల్ల చాట్రాయి మండలంలోని 5వేల ఎకరాలు సాగు భూములకు నీరు అందుతుందని చేశారు. చింతలపూడి నూజివీడు నియోజకవర్గం లో ఉన్న 25 వేల ఎకరాలు సస్యశ్యామలంగా పండుతుందని హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలి

విశాలాంధ్ర - గణపవరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువు పూర్తి చేసుకుని బయటకు వెళుతున్న విద్యార్థిని విద్యార్థులు కష్టపడి భవిష్యత్తులో ఉన్నతమైన స్థానానికి చేరుకోవాలని శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి అన్నారు. బుధవారం 2020- 23 బ్యాచ్ కి వీడ్కోలు వేడుకలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ బయటికి వెళ్లే విద్యార్థులు ప్రస్తుతం ఉన్న విద్యార్థులతో వారి అనుభవాలను పంచుకోవాలని ఆమె కోరారు. ఆఖరి సంవత్సరం చదివిన విద్యార్థులకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ నిర్వహించిన 5 సెమిస్టర్ లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతి అందజేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి మధురాజు, అధ్యాపకులు డాక్టర్ టి అక్కిరాజు, డాక్టర్ కె స్వరూపరాణి, బి శ్రీనివాసరావు, డాక్టర్ సిహెచ్ చైతన్య, డాక్టర్ సిహెచ్ అనురాధ, డాక్టర్ జి వి రావు, డాక్టర్ జి వి రమణ, డి వి వి చిన సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వాసవి ఇంజినీరింగ్ కళాశాల వద్ద నేలకొరిగిన భారీ వృక్షం

- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : ఉపరితల ద్రోణి ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురు గాలులు కారణంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. పల్లపు ప్రాంతాల్లో వరి నాట్లు నీటమునిగాయి. వర్షాల కారణంగా పెదతాడేపల్లి నుంచి రామన్నగూడెం మీదుగా జగ్గన్నపేట వెళ్ళే రహదారిపై వాసవి ఇంజినీరింగ్ కళాశాల వద్ద భారీ వృక్షం పడిపోవడవంతో విద్యార్థులు, వాహనదారులు, రైతులు ఇబ్బందులకు గురయ్యారు. తెల్లవారుజామున ఈదురుగాలులకు భారీ వృక్షం పడిపోవడంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు. వెంట్రావుపాలెం, అప్పారావుపేట, మాధవరం, జగన్నాధపురం, ఆరుగొలను, పట్టింపాలెం, వీరంపాలెం, నందమూరు తదితర గ్రామాల్లో పంట మురుగుబోదులు సక్రమంగా లేకపోవడంతో వరినాట్లు నీటమునిగాయి. ఇప్పటికే వేలాది రూపాయలు వరినాట్లు వేసేందుకు ఖర్చుపెట్టిన రైతులు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అమృతపురం, ఇటుకులగుంట, దండగర్ర గ్రామాల్లో కూరగాయలు, కొమ్ముగూడెం, నీలాద్రిపురం, జగ్గన్నపేట, వెంకట్రామన్నగూడెం తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి.

వలంటీర్ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర- ఆకివీడు : గ్రామ సచివాలయ పరిధిలో పనిచేసే వాలంటరీల సేవలు అభినందనీయమని తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో కె.వాణి అన్నారు. బుధవారం మండలంలోని కుప్పంపూడి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సుమారు 2 వేల 8 వందల మందికి అంటే సుమారు 99 శాతం అర్హులకు కావలసిన సర్టిఫికెట్లు పంపిణీ చేసి మండలంలోని మొదటి స్థానంలో ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా కుప్పనపూడి గ్రామ సర్పంచ్ ముత్యాల అనురాధ శివయ్య ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, 12వ వార్డు నెంబర్ ముద్దే కేశవ సహకారంతో వాలంటరీలకు ప్రోత్సాహ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్ర, జేఈ శ్రీనాథ్, పంచాయతీ సెక్రెటరీ, సిబ్బంది వలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

వాలింది.. కూలితే...



విశాలాంధ్ర పెనుమంట్ర: నెగ్గి పూడి పంచాయతీ పరిధిలోని వెలగలేరు - సత్యవరం వెళ్లే ప్రధాన మార్గంలో విద్యుత్ స్తంభాలు వాలి ప్రమాదంగా మారాయి. వీటి విషయంలో స్థానిక సిబ్బంది చూసి ఉన్నట్లు వ్యవహరిస్తున్నారు. చిన్నపాటి గాలులకు వాలిన స్తంభాలు కూలితే గంటల తరబడి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. విద్యుత్ స్తంభాలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. ప్రమాదవశాత్తు స్తంభాలు కూలితే పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. వాలిన స్తంభాల విషయంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సరిగ్గా దృష్టి పెట్టడం లేదని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.ఈ స్తంభాల కారణంగా ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆయా ప్రాంత వాసులు భయపడుతున్నారు.

నీట మునిగిన ఇళ్లు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలో అంకాల గూడెం గ్రామంలో కొత్తపేట ఎస్సీ కాలనీ కి ఎగువ ప్రాంతాలైన కొండ ప్రాంతాల నుండి వచ్చే నీరు అధికంగా రావడంతో ఇళ్లన్నీ మోకాళ్ళ లోతు నీళ్లతో మునిగిపోయాయి. పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు బోడిగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ గడ్డియ్య ఎస్ సి కాలనీ ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతానికి చేరవేసి, వారికి భోజన సదుపాయాలను సమకూర్చారు. ఇదిలా ఉండగా ప్రతి ఏడాది వర్షాలు అధికంగా కురిసినప్పుడు ఎస్ సి కాలనీ పూర్తిగా జలమయమవుతుందని సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎస్ సి కాలనీ ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టండి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : అధ్వానంగా ఉన్న రోడ్లు నిర్మాణం వెంటనే చేపట్టాలని కొయ్యలగూడెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్ ప్రభుత్వాన్ని కోరారు. మండలం బయ్యనగుడెం గ్రామంలో సరిపల్లి రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది , రోడ్డును పారేపల్లి నరేష్ పరిశీలించరు. దిప్పకాయల పాడు, కిచ్చప్ప గూడెం, వంగబొత్త గూడెం, సరిపల్లి, ధర్మారావుపేట, బిల్లు మిల్లి, మర్రిగూడెం, గ్రామాల ప్రజలు నిత్యం ఈ రోడ్డుపై రాకపోకలు కొనసాగిస్తారని, ప్రభుత్వాసుపత్రికి వచ్చే ప్రజలు, విద్యార్థులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. నిర్మాణం చేపట్టకపోతే త్వరలో స్థానిక ప్రజలతో కలిసి దీక్ష చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు అనేం సాయి, కురుకూరి దుర్గారావు, మార్గాని వెంకటేశ్వరరావు, తిరుమల శెట్టి గంగాధర్,పారేపల్లి సత్యనారాయణ, అనెం సత్యనారాయణ,సింగంశెట్టి దుర్గారావు, తాడి దుర్గారావు,అనెం నాగేంద్ర, కలప కంటే లోవ కుమార్, దిలీప్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణగూడెంలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - చాగల్లు : మండలంలోని బ్రాహ్మణగూడెం గ్రామంలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అర్హులైన వారికి మంత్రి ఉచితంగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్హులై ఉండి పథకాలు అందని లబ్ధిదారులకు ఈ కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు ఆత్కూరి దొరయ్య, చాగల్లు మండలం వైఎస్ఆర్సిపి అధ్యక్షులు చెల్లింకుల దుర్గా మల్లేశ్వర రావు, గ్రామ సర్పంచ్, అధికారులు, వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలి

విశాలాంధ్ర - రాజమండ్రి : మణిపూర్‌లో ఓ కుటుంబానికి చెందిన మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన సంఘటన అమానుషమని ఉమ్మడి గోదావరి జిల్లాల భారత భీమా సంస్థ(ఎల్ఐసి) ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి యమ్.కోదండరామ్ అన్నారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని భారత బీమా సంస్థ డివిజనల్ కార్యాలయం ఎదుట ఐసిఈయూ ఆధ్వర్యంలో ఎల్ఐసి ఉద్యోగులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు.దీనిలో భాగంగా బాధిత కుటుంబాలకు న్యాయం జరగాలని, అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాథ్యూస్, సత్యదేవ, రాజ్యం.విజయ దుర్గ,శ్రావణ శ్రీదేవి, ఉమాదేవి,శిరీష,రమణ,మణి,గనెయ్య,విశ్వనాథ్,పట్నాయక్,దొరబాబు, గాయత్రి, సుబ్బలక్ష్మి,ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ళ ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - రాజానగరం : రాజానగరం మండలంలో గురువారం జరగనున్న టీడీపీ పరిచయ వేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు కందుల బాబు రాయుడు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులకు బుదవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాజానగరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ ఆధ్వర్యంలో టిడిపి నూతన ఇన్‌చార్జి బొద్దు అనంత వెంకటరమణ చౌదరితో రాజానగరంలోని రాయల్ ఫంక్షన్ నందు ఈ నెల 27వ తేదీన సాయంత్రం 4 గంటలకు పార్టీ శ్రేణులు పరిచయ వేదిక జరుగుతుందన్నారు. ఈ పరిచయ వేదికకు టీడీపీ నేతలు కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

జనసేన నాయకుల ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : ఉప్పలగుప్తం మండలం కూనవరం గ్రామానికి చెందిన జన సైనికుడు బడుగు గోపి అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులతో తన వంతు సహాయంగా సహృదయంతో అమలాపురం నియోజకవర్గం ఇంచార్జ్ శెట్టిబత్తుల రాజబాబు చేతుల మీదుగా బుధవారం బడుగు గోపికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి చిక్కం భీముడు, జనసేన పార్టీ నాయకులు ఆకుల బుజ్జి, వాకపల్లి సత్యనారాయణ, గంది స్వామి, గొల్లకోటి వెంకటేష్, నాగిరెడ్డి రాంబాబు, దివ్వి రాజు, సుందర్నీడి రాజా, అర్లపల్లి దుర్గ, మధుర జాన్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడింది అన్నదమ్ములే

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరంలోని గోదావరి అక్విడక్టు సమీపంలో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయం, శిరిడి సాయిబాబా వారి ఆలయాలలో, పక్కనే ఉన్న కూరగాయల షాపులలో చోరీలకు పాల్పడిన వ్యక్తులు అన్నదమ్ములేనని పి గన్నవరం ఎస్ఐ పరికోటి శాస్త్రి తెలిపారు. మండలంలోని యర్రంశెట్టి వారిపాలెం గ్రామానికి చెందిన యర్రంశెట్టి రాజు, అతని తమ్ముడు దుర్గాప్రసాద్ గత కొన్నేళ్లుగా హైదరాబాదులోని జీడిమెట్ల వద్ద ఉంటున్నారు. యర్రంశెట్టి రాజు పై గతంలో నమోదైన దొంగతనం కేసుల నేపథ్యంలో నిందితుడిగా ఉన్న అతడు అమలాపురంలోని కోర్టుకు ఇటీవల వాయిదాకు హాజరయ్యాడన్నారు. ఈనెల 22వ తేదీ అర్ధరాత్రి పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద డిబ్బీని పగులగొట్టి. అందులోని రూ.5 వేలను, పక్కనే ఉన్న కూరగాయల షాపులోకి చొరబడి రూ.1500లను దోచుకున్నారు. 24వతేదీ అర్ధరాత్రి షిర్డీ సాయిబాబా వారి ఆలయం తలుపులు బద్దలు గొట్టేందుకు ప్రయత్నించి విఫలనుయ్యారు. దీంతో ఆలయ కమిటీల చైర్మన్లు, కూరగాయల షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు రెండు ఆలయాలలో దొంగతనాలు చేసే సమయంలో అతడి తమ్ముడైన దుర్గాప్రసాద్‌ను కాపలా ఉంచేవాడని తెలిపారు. ఈ మేరకు వారిని పి గన్నవరం గ్రామ శివారు బోడపాటివారిపాలెం వద్ద బుధవారం అరెస్టు చేసి కొత్తపేట కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

ఏజెన్సీ ప్రాంతంలో నిలిచిన రాకపోకలు

విశాలాంధ్ర- కొయ్యలగూడెం : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా ఏజెన్సీ ప్రాంతాలు, కొండవాగులు పొంగిపొర్లుతున్నాయి. పోలవరం నియోజకవర్గంలో కొయ్యలగూడెం మండలం, బుట్టాయిగూడెం మండలం, పోలవరం మండలాల ప్రజలు వారి అవసరాల నిమిత్తం ఏజెన్సీ ముఖద్వారమైన కొయ్యలగూడెం పట్టణం వచ్చి వారికి అవసరమైన నిత్యవసర వస్తువులను కొనుగోలు చేసుకుని వెళుతుంటారు. అంతేకాక ఆరోగ్య విషయంపై ఏవైనా అనారోగ్యాలు సంభవించిన యెడల మెరుగైన వైద్యం కోసం కొయ్యలగూడెం పట్టణ ఆసుపత్రులకు వచ్చి వైద్య సేవలు వినియోగించుకుంటారు. విద్యార్థులు వారి ఉన్నత చదువుల కోసం కూడా కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం పట్టణాలలో, విద్యను అభ్యసిస్తూ ఉంటారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఏజెన్సీ గ్రామాల నుండి రాకపోకలు కొనసాగించే గిరిజన ప్రజలు వారి గ్రామాల నుండి రావడానికి కాలువలు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం గిరిజన, దళిత, ప్రజలకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం వారి యొక్క అభివృద్ధికి కృషి చేస్తున్నామని మాటలు చెప్పడం తప్ప వాటిని అమలు చేయడంలో విఫలం చెందుతున్నారని గిరిజన ప్రాంత ప్రజలు వాపోతున్నారు. కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామంలో తూర్పు కాలువ పడమటి కాలువ ఉప్పొంగి పొర్లడంతో పోలవరం నుండి కన్నాపురం, బుట్టాయిగూడెం నుండి కన్నాపురం మీదుగా వచ్చే ప్రజల రాకపోకలు, వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

దీప్తి పాఠశాలలో కార్గిల్ విజయ్ దివాస్

విశాలాంధ్ర - మామిడికుదురు : కార్గిల్ విజయ్ దివాస్ ను ప్రతీ ఏటా జులై 26న దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నామనీ దీప్తి విద్యాసంస్థలు కరెస్పాండెంట్ డివివి సత్యనారాయణ అన్నారు. మామిడికుదురు స్థానిక దీప్తి పాఠశాలలో బుధవారం కార్గిల్ విజయ్ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన అమరవీరులకు విద్యార్థులు కొవ్వొత్తులతో ఘన నివాళులు అర్పించారు. 1999 జులై 26న భారత సైన్యం పాకిస్తాన్ సైన్యం పై విజయం సాదించగా, లడఖ్‌లోని కార్గిల్ ప్రాంతంలో 60 రోజులు పైగా జరిగిన ఈ యుద్ధంలో భారతసైన్యం విజయం సాధించిందనీ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో దీప్తి పాఠశాల ప్రధానోపాధ్యాయులు యక్కలదేవర నాగన్నబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి విద్యార్థులకు క్రమశిక్షణ నవోదయతోనే

విశాలాంధ్ర - పెద్దాపురం : ఎన్‌సిసి విద్యార్థులకు మంచి క్రమశిక్షణ నవోదయ విద్యాలయల ద్వారానే సాధ్యపడుతుందని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఎన్ సీసీ డైరెక్టరేట్ డీడీజీ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి అన్నారు. కార్గిల్ విజయ్ వాస్ పురస్కరించుకుని బుధవారం పెద్దాపురం జవహార్ నవోదయ ఎన్ సీసీ విద్యార్థులు చేస్తున్న ఫైరింగ్ శిక్షణను ఆయన కాకినాడ ఎన్సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఏకే రిషితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నవోదయలో ఎన్ సీసీ విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ తీరును ఆయన అభినందించారు. తెలంగాణా రాజధాని హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణకు ఫోన్ చేసి పెద్దాపురం నవోదయలో జరుగుతున్న ఎన్సీసీ విద్యార్థుల శిక్షణపై తెలిపి ప్రిన్సిపాల్ కె రామిరెడ్డి సేవలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీసీ ఆఫీసర్ పి.కిషోర్ కుమార్, విద్యాలయ సిబ్బంది. ఎన్సీసీ అధికారులు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీతో బోధన చేయాలి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని జోడించి విద్యా బోధన చేయాలని సమగ్ర శిక్షణ సిఎమ్ఓ, ఐఈ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు ఉపాధ్యాయులకు సూచించారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ల్లోనూ, వొమ్మంగి ఎమ్‌పిపి స్కూల్ లోనూ, ధర్మవరం జిల్లా పరిషత్ హైస్కూల్లోనూ జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ప్రతీ రోజు పాఠశాలకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. బడి వయస్సు కలిగిన ఏ ఒక్కరూ కూడా బడి బయట ఉండకూడదన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు సబ్జెక్టులు ప్లాన్ చేసుకోవాలని, డైరీలు అప్డేట్‌గా ఉంచాలని, నోట్స్‌లు దిద్దాలన్నారు. ప్రతీ విద్యార్థి యూనిఫామ్, షూ, బెల్ట్ ధరించి బ్యాగ్, పుస్తకాలతో బడికి హాజరయ్యేలా చూడాలని సూచించారు. వీరి వెంట ఎమ్ఈఓలు వి. రాజబాబు, వై అచ్చిరాజు, సిఎంఆర్టీ ఇ. రాంజీ ప్రసాద్ ఉన్నారు.

గుర్రంపాలెంలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - జగ్గంపేట : గడపగడపకు తిరిగినప్పుడు సమస్యలను తెలుసుకుని పరిష్కరించామని, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకునేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట మండలం గుర్రంపాలెంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంపీడీవో వసంత్ కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చంటిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రంపాలెం గ్రామానికి తాను చాలా రుణపడి ఉన్నానని, గ్రామంలో తనకు ఇచ్చిన మెజారిటీ ఎవరికి ఇవ్వలేదన్నారు. ఈ గ్రామానికి వివిధ పథకాల ద్వారా సుమారు రూ.12 కోట్లపైన లబ్ధిచేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీపీ తోట రవి, గ్రామ సర్పంచ్ చీపురుపల్లి లక్ష్మీ రాఘవ, వైస్ ఎంపీపీ నక్కా శీను, వైసిపి నాయ కులు పడాల విష్ణు, అధికారులు నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయం స్టాఫ్, వాలంటీర్స్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫారం అందజేత

విశాలాంధ్ర - చాగల్లు : చాగల్లు బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం నాదెండ్ల శ్రీరామ్ చౌదరి (నాని) తల్లి చంద్రకళ జ్ఞాపకార్థం 20 మంది విద్యార్థులకు యూనిఫారం ఆళ్ల హరిబాబు చేతుల మీదగా అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి వీర్రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నాదెండ్ల శ్రీరామ చౌదరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ముంపు గ్రామాల్లో వైద్య శిబిరం

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలంలోని కోయిదా పంచాయితీలో గల ముంపు గ్రామాల్లో ప్రభుత్వ వైద్యులు యన్. గణేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వర్షాలు కారణంగా ఎటువంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్త తెలియజేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో జబ్బులతో బాధపడుతున్న వారికి వైద్యం అందించి మందులు ఇచ్చారు.

ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు

విశాలాంధ్ర-మండవల్లి:ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ముంపు సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ మెండా ఝాన్సీ తెలిపారు. మండవల్లి గ్రామంలో వర్షాలకు రహదారులపై నిలిచిన నీటిని జెసిబి సాయంతో దారి మళ్లింపు చర్యలను బుధవారం చేపట్టారు. మురుగు నీరు పారుదలకు అడ్డంకులు లేకుండా చేస్తున్నామని వర్షాలు మరో రెండు రోజుల పాటు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ సూచించారు. పనుల పరిశీలనలో కార్యదర్శి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు మెండాసురేష్‌లు పాల్గొన్నారు.

నీట మునిగిన పొలాలను పరిశీలించిన జడ్పీ చైర్మన్

విశాలాంధ్ర-పెదపాడు:జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ పెదపాడు మండలంలోని సత్యవోలు, సకలకొత్తపల్లి, కడిమికుంట గ్రామాలలో పలు ప్రాంతాలలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ మండల పరిధిలో వరి పండించే 16 వేల ఎకరాలకు గాను 8 వేల ఎకరాలలో రైతులు వరి నాట్లు పూర్తి చేశారని గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సుమారుగా 1500 ఎకరాలు నాట్లు వేసిన పొలాలు నీట మునిగి పాడైపోయాయని ఒక్కో ఎకరానికి రూ.15000/- నష్టపోయారని ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి తగు న్యాయం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దెందులూరు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ అప్పన్న ప్రసాద్, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఏలూరు జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఆళ్ల సతీష్ చౌదరి, బిసి సెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాద రావు, అగ్రికల్చర్ ఏడి సుబ్బారావు, పెదపాడు తహసిల్దార్ విజయకుమార్ రాజు, సత్యవోలు సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, ఎంపిటిసి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాద మృతుని కుటుంబానికి నగదు అందజేత

విశాలాంధ్ర-టి నరసాపురం : మండల కేంద్రమైన టి నరసాపురం పంచాయితీలోని ఇందిరా కాలనీకి చెందిన దొంతా నాగేశ్వరరావు విద్యుత్ ప్రమాదంలో మృతి చెందగా ప్రభుత్వ భీమా 5లక్షల రూపాయలు మంజూరైనాయి. ముందుగా బుధవారం 10వేల రూపాయలు బాదిత కుటుంబానికి మండల వైసిపి నాయకులు దేవరపల్లి సీతారాం ప్రసాద్, యూత్ అధ్యక్షులు కన్నం సర్వేశ్వరావు ల చేతుల మీదుగా అందజేశారు. బాదిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని రకాల సౌకర్యాలు అందేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జెసిబి శ్రీను తదితరులు ఉన్నారు.

ముంపు బారిన పొలాలు

విశాలాంధ్ర - పెనుమంట్ర: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కోమటి చెరువు, భట్ల మగుటూరు, ఆలమూరు, మాముదూరు, పొలమూరు, మల్లిపూడి, పరిధిలోని వరి పొలాలు ముంపు బారిన పడడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మురుకు బోదెల నిర్వహణ లేకపోవడంతో ప్రతి సంవత్సరం ముంపు సమస్య ఉత్పన్నమవుతున్నది. ప్రస్తుతం నాట్లు నాటి రోజులు గడుస్తున్నాడంతో కురుస్తున్న వర్షాల ప్రభావంతో తెగుళ్లు సోకే అవకాశం, నాట్లు కుళ్ళిపోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.